
సాక్షి నంద్యాల
మంగళవారం। 22। ఆగస్టు। 2023



జలదిగ్బంధం వీడుతూ..

కొత్తపల్లి: శ్రీశైలం డ్యాంలో నీటి నిల్వలు తగ్గుతుండటంతో జలదిగ్బంధనంలో ఉన్న సంగమేశ్వరాలయం మళ్లీ బయటపడుతోంది. సోమవారం ఆలయ గోపుర శిఖరం కనిపించింది.



శాస్త్రోక్తంగా వెండి రథోత్సవం

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం సహస్రదీపార్చన పూజలు నిర్వహించారు. అనంతరం శాస్త్రోక్తంగా వెండి రథోత్సవం జరిపారు.



0.8 టీఎంసీల నీటి నిల్వ

గూడూరు: సుంకేసుల జలాశయంలో సోమవారం సాయంత్రానికి 0.881 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో ఏమీ లేకపోగా, డ్యాం నుంచి కేసీ కాల్వకు 221 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

కౌలు రైతుకు వెన్నుదన్ను

- పూర్తి దశకు చేరుకున్న కౌలు కార్డుల పంపిణీ
- ప్రభుత్వ నిర్ణయంతో మారిన కౌలు రైతు దిశ
- సాధారణ రైతులతో సమానంగా ప్రభుత్వ పథకాల వర్తింపు
- జిల్లా వ్యాప్తంగా 21,465 మంది కౌలు రైతులు

రైతు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోంది. విత్తు మొదలు దిగుబడి అమ్మకం వరకు అండగా నిలుస్తోంది. కౌలు రైతులను సైతం ప్రోత్సహిస్తూ కష్టనష్టాల్లో తోడుగా ఉంటోంది. జగనన్న సురక్ష కార్యక్రమం వారి పాలిట వరంగా మారింది. జిల్లాలో 21,465 మంది కౌలు రైతులను ప్రభుత్వం గుర్తించి పంటసాగు హక్కు పత్రాల (సీసీఆర్‌సీ)ను శరవేగంగా పంపిణీ చేస్తోంది. ప్రభుత్వ నిర్ణయంతో కౌలు రైతులకు సాధారణ రైతులతో సమానంగా ప్రభుత్వ పథకాలు వర్తిస్తుండటంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

బనగానపల్లె/నందికొట్కూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ నిర్ణయంతో కౌలురైతుల దశ, దిశ మారింది. గతంలో వీరికి కౌలు కార్డులు మంజూరు చేసినా పెద్దగా ప్రయోజనం ఉండేది కాదు. భూ యజమాని అనుమతిస్తే తప్ప వీరికి ఎలాంటి ప్రభుత్వ రాయితీలు వచ్చేవి కావు. అలాగే వారు పండించిన పంటలను కొనుగోలు కేంద్రాల్లో నేరుగా విక్రయించుకోలేని దుస్థితి ఉండేది. బ్యాంకు రుణాలు అందని ద్రాక్షగానే మిగిలేవి. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కౌలు రైతుల కష్టాలు గుర్తించి ఆదుకుంటోంది. భూ యజమాని హక్కులకు ఎలాంటి భంగం కలిగించకుండా పంట సాగు చేస్తున్న కౌలురైతులకు అన్ని రాయితీలు వర్తించేలా పంట సాగు హక్కు పత్రాలను అందజేస్తోంది. వీటితో వ్యవసాయ శాఖ ద్వారా వచ్చే అన్నీ రాయితీలు కౌలు రైతులు నేరుగా పొందడంతో పాటు బ్యాంకుల నుంచి ఎలాంటి పూచీకత్తు లేకుండా రుణం పొందే వెసులుబాటు కల్పించింది. జిల్లాలోని 28 మండలాల్లో 447 గ్రామాల్లో 21,465 మంది కౌలు రైతులను ప్రభుత్వం గుర్తించింది. ఇప్పటి వరకు 20,473 మంది కౌలు రైతులకు పంటల సాగు హక్కు పత్రాలను(సీసీఆర్‌సీ) పంపిణీ చేసింది. గత నెలలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలోనే సుమారు 8 వేల మంది కౌలు రైతులకు హక్కుపత్రాలను అందజేయడం విశేషం. మిగిలిన వారికి కూడా త్వరలోనే హక్కుపత్రాలను పంపిణీ చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

ప్రభుత్వ రాయితీలు నేరుగా..

సొంత భూమి కలిగిన రైతులతో సమానంగా రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులకు సంపూర్ణ ప్రోత్సాహం అందిస్తోంది. గత టీడీపీ ప్రభుత్వం కౌలు రైతులను గుర్తించినా ప్రయోజనం ఉండేది కాదు. అతివృష్టి, అనావృష్టి సమయాల్లో కోలుకోలేక ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనలు ఉన్నాయి. ఈ క్రమంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం ద్వారా రైతులకు ఏడాదికి మూడు విడతల్లో రూ.2 వేల చొప్పున రూ. 6 వేలు అందిస్తే, రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.7,500 కలిపి వైఎస్సార్ రైతు భరోసా కింద మొత్తం రూ.13, 500 చెల్లిస్తోంది. కానీ కౌలు రైతుకు కేంద్రం ఎలాంటి నగదు ఇవ్వడం లేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో కౌలురైతుకు ఏడాదికి రూ.13,500 అందజేస్తున్నారు. భూ యజమాని హక్కులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా 11 నెలల కాలపరిమితితో పంట సాగు చేస్తున్న కౌలురైతు కార్డు పని చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అలాగే విపత్తుల వేళ జరిగిన పంట నష్టానికి ఇన్‌పుట్ సబ్సిడీ సైతం ఇచ్చి ఆదుకుంటోంది. అలాగే కనీసం మద్దతు ధర, రాయితీ విత్తనాలు పొందే అవకాశం కల్పించింది.



నందికొట్కూరు సమీపంలో కౌలురైతు సాగు చేసిన మొక్కజొన్న పంట

జిల్లాలో కౌలు కార్డుల పంపిణీ ఇలా..

డివిజన్	మంజూరు	పంపిణీ
నంద్యాల	6,363	5,749
నందికొట్కూరు	3,227	2,930
ఆళ్లగడ్డ	4,149	3,946
కోవెలకుంట్ల	4,810	4,734
డోన్	917	944
ఆత్మకూరు	2,170	1,999

అర్హులందరికీ పంపిణీ



అర్హత కలిగిన కౌలురైతులందరికీ కౌలు కార్డులు అందజేస్తున్నాం. కార్డులు జారీ చేయడంతో భూ యజమానికి ఏ విధమైన ఇబ్బంది ఉండదు. కేవలం 11 నెలల కాలపరిమితితో కార్డు పని చేస్తుంది. సాగు హక్కు తప్ప భూమిపై వారికి హక్కు ఉండదు. ఇంకా ఎవరైనా అర్హులుండి దరఖాస్తు చేసుకుంటే వారికి కూడా కౌలుకార్డులు అందజేస్తాం.

– మోహన్‌రావు, జిల్లా వ్యవసాయ అధికారి



బనగానపల్లె మండలం తమ్మడపల్లె గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో కౌలు రైతుకు సీసీఆర్‌సీ పత్రం పంపిణీ చేస్తున్న దృశ్యం (ఫైల్)

పూచీకత్తు లేకుండా రుణ సదుపాయం

కౌలు రైతులకు మేలు చేసేలా ప్రభుత్వం 2019లో పంటసాగు హక్కు చట్టం అమల్లోకి తెచ్చింది. ఏటా ఏప్రిల్ నుంచి రైతుభరోసా కేంద్రాల ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించి ప్రభుత్వం కౌలు రైతులను గుర్తించి అర్హులకు గుర్తింపు కార్డులను మంజూరు చేస్తోంది. కార్డుల ద్వారా పంటల సాగు పెట్టుబడి కోసం రుణాలు మంజూరు చేసేలా బ్యాంకులకు ఆదేశాలు జారీ చేసింది. భూ యజమానులు ముందుగా పంట రుణాలు పొంది ఉంటే ఆ భూమిని కౌలుకు తీసుకున్న రైతులకు రుణం మంజూరు చేసేందుకు అవకాశం లేదు. ఈ సమస్యను అధిగమించేందుకు సీసీఆర్‌సీ కార్డులు పొందిన కౌలు రైతులను ఒక గ్రూపుగా వ్యవసాయశాఖ ఏర్పాటు చేస్తుంది. ఈ గ్రూపు వివరాలను వ్యవసాయాధికారులు బ్యాంకు అధికారులకు అందించడం ద్వారా వారికి సైతం రుణం లభించనుంది.

సీఎం జగన్ రైతు పక్షపాతి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి. ఇప్పటికే రైతు భరోసా కేంద్రాలు, అగ్రిల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. పాడి రైతుల కోసం అంబులెన్స్‌లు ఊరికి వస్తున్నాయి. కౌలు రైతులకు కార్డులు మంజూరు చేయడంతో ఎంతో ఉపయోకరంగా మారింది. కౌలు రైతుల కష్టాలను గుర్తించిన సీఎం రైతు భరోసా, వైఎస్సార్ పంటల బీమా సైతం వర్తింపజేస్తూ ఆదుకుంటున్నారు.

– నరసయ్య, కౌలు రైతు, ఇల్లూరు కొత్తపేట, బనగానపల్లె మండలం

మద్దతు ధర లభిస్తుంది



ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కౌలుకార్డు ద్వారా పంటను విక్రయించేందుకు ఇబ్బందులు తొలగిపోయాయి. గతంలో పంటను మార్కెట్‌లో మాత్రమే విక్రయించాల్సి వచ్చేది. కొనుగోలు కేంద్రంలో అమ్మేందుకు కౌలు రైతుకు అనుమతి ఉండేది కాదు. ఇప్పుడు కౌలు కార్డు ఇవ్వడంతో మద్దతు ధర పొందే అవకాశం కలిగింది. సీఎం వైఎస్ జగనన్న పాలనలో ఎరువులు, విత్తనాల కొరత లేదు. ఏటా సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నాయి.

– విల్సన్, కౌలురైతు, దామగట్ల, నందికొట్కూరు మండలం

అన్ని రాయితీలు వస్తున్నాయి



సీఎం వైఎస్ జగనన్న ప్రభుత్వంలో కౌలు రైతులకు సాధారణ రైతులతో సమానంగా అన్ని పథకాలు వర్తిస్తున్నాయి. వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసి అండగా నిలుస్తున్నారు. రైతు భరోసా పథకం కింద రూ.13,500 ఇస్తుండటంతో ఎంతో ఆసరాగా ఉంది. సమయానికి రైతు భరోసా డబ్బులు అందడంతో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేస్తున్నాను. జగనన్నకు రుణపడి ఉంటాం.

– శేషులు కౌలురైతు, కొక్కెరంచ గ్రామం, కొత్తపల్లి మండలం

న్యూస్‌రీల్

అన్నదాన పథకానికి రూ. 2 లక్షల విరాళం



శ్రీశైలానికి చెందిన దాత జ్ఞాపికను అందజేస్తున్న అధికారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి కర్నూలుకు చెందిన హరికుమార్‌రెడ్డి రూ.1,00,116, శ్రీశైలంకు చెందిన డి.వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి రూ.1,01,116 విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని విరాళాల కేంద్రంలోని పర్యవేక్షకులు టి.హిమబిందుకు అందజేయగా, వారు దాతలకు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, విరాళానికి సంబంధించిన బాండు, జ్ఞాపికను అందజేశారు.

వైభవంగా గరుడ పంచమి వేడుకలు



గరుత్మంతుడికి హారతి ఇస్తున్న అర్చకుడు

ఆళ్లగడ్డ: గరుత్మంతుని తపస్సుచే పునీతమై గరుడాద్రిగా ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం శ్రీమద్ అహోబిలంలో గరుడ పంచమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. గరుడ పంచమిని పురస్కరించుకుని సోమవారం దిగువ అహోబిలంలో కొలువైన మూలమూర్తి గరుత్మంతుడికి ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల వేదమంత్రోచ్చారణల మధ్య తిరుమంజనం కార్యక్రమం శాస్త్రోకంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ పూజలు ప్రధానార్చకులు వేణుగోపాలన్, మణియార్ సామ్యా నారాయణ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తులు

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అందించే ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు – 2023 కోసం జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ సుధాకర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు మండల, డివిజన్ స్థాయి అవార్డుల కోసం, జిల్లా స్థాయిలో 25వ తేదీ నుంచి 28వ తేదీ వరకు, రాష్ట్రస్థాయిలో 29 నుంచి 31తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

డీఎడ్ పరీక్ష ఫీజు 30లోపు చెల్లించాలి

కర్నూలు సిటీ: డీఎడ్ ఫోర్త్ సెమిస్టర్ పరీక్షలకు హాజరయ్యేవారు, గతంలో ఫెయిల్ అయిన విద్యార్థులు ఈ నెల 30వ తేదీలోపు ఫీజు చెల్లించాలని డీఈఓ డాక్టర్ వి. రంగారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు నుంచి ఆరు సబ్జెక్టులకు రూ.250, మూడు సబ్జెక్టులకు రూ.175, రెండు సబ్జెక్టులకు రూ.150, ఒక సబ్జెక్టుకు రూ.125 చెల్లించాలని డీఈఓ పేర్కొన్నారు.

జిల్లాకు మూడు సోలార్, విండ్ పవర్ ప్రాజెక్టులు మంజూరు

- రేపు వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్న సీఎం వైఎస్ జగన్

నంద్యాల/అవుకు: నంద్యాల జిల్లాకు మూడు సోలార్, విండ్ పవర్ ప్రాజెక్టులు మంజూరైనట్లు నెడ్‌క్యాప్ జిల్లా మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి సోమవారం తెలిపారు. అవుకు మండలంలో జూనూతల, ఉప్పలపాడు, కొండమనాయునిపల్లి గ్రామాల్లో గ్రీన్‌కో ఎనర్జీస్ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో 2,300 మెగా వాట్ల సోలార్ పవర్‌ప్రాజెక్టు, పాణ్యం మండలం ఆలమూరు గ్రామంలో ఏఎంగ్రీన్ ఎనర్జీ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో 700 మెగా వాట్ల సోలార్ పవర్, 300 మెగా వాట్ల విండ్ పవర్ ప్రాజెక్టులు, బేతంచెర్ల మండలం మాధవరం, డోన్ మండల కేంద్రంలో ఎకోరెన్ ఎనర్జీ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో 1,000 మెగా వాట్ల సోలార్ పవర్, మరో 1,000 మెగా వాట్ల విండ్ పవర్ ప్రాజెక్టులు మంజూరయ్యాయన్నారు. ఈ ప్రాజెక్ట్‌లకు ఈనెల 23న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారన్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు వర్చువల్‌గా శిలాఫలాకాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు.



అవుకు మండలం పిక్కలపల్లి తండా సమీపంలో సైలాన్ ఏర్పాటు పనులు జరుగుతున్న దృశ్యం

పెరుగుతున్న పత్తి, మిర్చి సాగు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో పత్తి, మిర్చి సాగు క్రమంగా పెరుగుతోంది. జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు 4.21 లక్షల హెక్టార్లు ఉండగా.. ఇప్పటి వరకు 3,02,461 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగయ్యాయి. ఈ ఏడాది ఇంతవరకు ఖరీఫ్ పంటల సాగు 71.75 శాతం ఉన్నట్లు స్పష్టమవుతోంది. పత్తి సాధారణ సాగు 2.50 లక్షల హెక్టార్లు ఉండగా.. 1,83,631 హెక్టార్లలో సాగు చేశారు. మిరప సాధారణ సాగు 19864 హెక్టార్లు ఉండగా.. ఇప్పటికే 25,405 హెక్టార్లలో సాగయింది. వేరుశనగ 38,729, కంది 19,170, ఉల్లి 9,851, ఆముదం 6,207, వరి 6,081, టమాట 864, మొక్కజొన్న 3,723, సజ్జ 3,316 హెక్టార్ల ప్రకారం సాగు చేశారు.

రెండో దశ పీఎంశ్రీకి కసరత్తు

నంద్యాల(న్యూటౌన్): ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకం రెండోదశలో పాఠశాల ఎంపికకు జిల్లా అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటి వరకు 523 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు దరఖాస్తుకు అర్హత సాధించాయి. వీటిలో హైస్కూళ్లు 76, ప్రాథమిక పాఠశాలలు 380, ప్రాథమికోన్నత పాఠశాలలు 66 ఉన్నాయి. గ్రామీణ ప్రాంతం నుంచి పాఠశాలలను ఎంపిక చేయాల్సి ఉంది. యూడైస్ 2021–22 ద్వారా విద్యార్థుల సంఖ్యతో పాటు 42 అంశాలను ప్రామాణికంగా తీసుకుని పాఠశాలలను ఎంపిక చేస్తారు. మూడంచెల ప్రక్రియ ద్వారా పాఠశాలలను ఎంపిక చేయనున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అనంతరం వచ్చే మార్కుల ఆధారంగా పాఠశాలలకు పీఎంశ్రీ పథకానికి ఎంపిక అవుతాయి. ఎంపికైన పాఠశాలలకు కేంద్ర ప్రభుత్వం విడతల వారీగా నేరుగా నిధులు మంజూరు చేస్తోంది. ఈ నిధులతో విద్యార్థులకు అవసరమైన సాంకేతిక సాధనాలను ఆయా పాఠశాలలు సమకూర్చుకోవచ్చు. ఐదేళ్ల వరకు ఆర్థిక, సాంకేతిక సహకారం లభిస్తాయి. తొలి విడతకు నంద్యాల జిల్లాలో 28 పాఠశాలలు ఎంపిక అయ్యాయి. పీఎంశ్రీ పోర్టల్లో దరఖాస్తు చేసుకునే విధానంపై ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులకు ఇప్పటికే వెబెక్స్ ద్వారా అవగాహన కల్పించామని నిర్వహించినట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

స్పందన అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తున్న జగనన్నకు చెబుదాం – స్పందనలో స్వీకరించిన అర్జీల సత్వర చర్యలు తీసుకొని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి, ఇతర జిల్లాధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం – స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన ఫిర్యాదులను నిర్ణీత కాల పరిమితిలోగా ప్రజలు సంతృప్తి చెందే స్థాయిలో పరిష్కరించాలన్నారు. పెండింగులో ఉన్న 132 రీఓపెన్ సర్వీసులకు సంబంధించి దరఖాస్తులన్నింటినీ వెంటనే క్లియర్ చేయాలన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా మంజూరైన 1,372 పనుల్లో 705 పనులు పురోగతిలో ఉన్నాయని మిగిలిన పనులు వెంటనే గ్రౌండ్‌లోకి తీసుకరావాలన్నారు. స్పందనలో వచ్చిన 215 దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ

స్పందనలో కొన్ని వినతులు..

- మాజీ సైనికుల కోటా కింద 2012లో సర్వే నెం.174, 175లో 9.8 సెంట్లు ఇచ్చారని, ఈ భూమిలో సాగు చేసుకుంటున్నానని, జీవో 297 ప్రకారం అసైన్‌మెంట్ నిషేధిత జాబితా నుంచి తొలగించాలని కోరుతూ బనగానపల్లెకు చెందిన మాజీ సైనికుడు ఎస్ఎం బాషా కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించుకున్నారు.
- తనకున్న 1.95 సెంట్ల స్థలాన్ని ఆన్‌లైన్ ఎక్కించాలని కోరుతూ దొర్నిపాడు మండలం క్రిష్టిపాడు గ్రామానికి చెందిన బికారి సాహెబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.
- సర్వే నంబర్ 34లో 16 సెంట్ల భూమి ఉందని, ఈ స్థలంలో కరెంట్ తీగలు వెళ్తున్నాయని, వాటిని తొలగించేందుకు విద్యుత్ అధికారులు అధిక మొత్తంలో చార్జ్ చేస్తున్నారని, అంత మొత్తం చెల్లించుకోలేనని కరెంటు తీగల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని మహానంది మండలం గాజులపల్లె గ్రామానికి చెందిన జయమ్మ కలెక్టర్‌ను కోరారు.


పంచమూర్తుల ప్రతిరూపం.. బృందావనం

- మంత్రాలయ క్షేత్రానికి మూడు యుగాల చరిత
- పరమ పవిత్రంగా బృందావన నిర్మాణం
- సాక్షీభూతంగా హిరణ్యకశిపుడి శివలింగం

మంత్రాలయం.. అవతారమూర్తి శ్రీ రాఘవేంద్రస్వామి కొలువైన క్షేత్రం. సద్గురువు సశరీరంగా బృందావన ప్రవేశం చేసిన పరమ పవిత్ర ప్రాంతం. ఈ వేదభూమికి మూడు యుగాల చరిత్ర ఉంది. ఇక్కడ బృందావన నిర్మాణ సంవిధానం అపురూపం. శ్రీ రాఘవేంద్ర స్వామి మంత్రాలయం పుణ్యభూమిలో కొలువుదీరడం మహాద్భుతం. వేదభూమి చరిత, బృందావన ప్రవేశం, బృందావన నిర్మాణ విశేషాలపై ప్రత్యేక కథనం..

మంత్రాలయం: బ్రహ్మలోకంలో శంకుకర్ణ అనే కర్మజ దేవత మూలరూపమే రాఘవేంద్రస్వామి. బ్రహ్మ దేవుడు పూజకు ద్రవ్యాలు సమకూర్చే పరిచారకుల గణం (కర్మజ దేవతలు)లో శంకుకర్ణ ఒకరు. బ్రహ్మదేవుడు పూజావేళ సరస్వతి వీణానాదానికి తన్మయుడై ఉన్న తరుణంలో శంకుకర్ణ సైతం నాద వినోదంలో మైమరిచారు. నాదాన్ని ఆలకిస్తూ బ్రహ్మదేవుడి పూజా సామగ్రి సమకూర్చడంలో ఉదాసీనత వహించడంతో శంకుకర్ణ శపించబడతాడు. శాప పుణ్యాన కృతయుగంలో హిరణ్యకశిపుడి కుమారుడు ప్రహ్లాదరాయలుగా జన్మిస్తారు. శంకుకర్ణ తొలి అవతారమే ప్రహ్లాదరాయలు. ఇక ద్వాపర యుగంలో భీష్ముడి పెద్దనాన్న ప్రతీప మహారాజు రెండవ కుమారుడు బాహ్లీకరాజుగా పుడతారు. కలియుగంలో విజయనగర సామ్రాజ్యం రాజు శ్రీకృష్ణదేవదేవరాయలు రాజగురువు వ్యాసరాయలుగా అవతారమెత్తుతారు. నాలుగో అవతారంగా తమిళనాడు రాష్ట్రం భువవగిరిలో తిమ్మణ్ణభట్, గోపికాంబా పుణ్యదంపతులకు రెండో కుమారుడు వేంకనాథుడిగా జన్మిస్తారు. 1595లో జన్మించిన వేంకనాథుడు స్వప్నంలో సరస్వతీ దేవి కోరిక మేరకు సన్యాసం స్వీకరించారు. మధ్వమత గురు పరంపర 31వ యతివరేణ్యులు సుధీంద్రతీర్థులచే సన్యాసం పుచ్చుకుని రాఘవేంద్రులుగా నామకరణం పొందారు.

బృందావన ప్రవేశం



కృతయుగంలో ప్రహ్లాదరాయలు, త్రేతాయుగంలో శ్రీరామచంద్రుడు, ద్వాపర యుగంలో శ్రీకృష్ణార్జులు పాదాల స్పర్శతో మంత్రాలయం పుణ్యభూమిగా వర్ధిల్లింది. ఇదే భూమినే సద్గురు రాఘవేంద్రస్వామి కోరి బృందావన ప్రవేశం చేశారు. 1671 ఆగస్టు నెల శ్రావణ బహుళ విదియ రోజున సశరీరంగా బృందావన ప్రవేశం చేశారు.


బృందావన విశిష్టత

నరసింహ స్వామి, శ్రీరామచంద్రమూర్తి, శ్రీకృష్ణభగవానుడు, వేద వ్యాసుడు, హయగ్రీవుడి ప్రతిరూపమే బృందావనంగా పేర్కొంటున్నారు. పంచమూర్తుల ప్రతిరూపంగా పవిత్ర బృందావనాన్ని భక్తితో కొలుస్తున్నారు. వనవాసంలో భాగంగా శ్రీరామచంద్రమూర్తి మాధవరం వంక సమీపంలో నల్లరాతిపై సేద తీరారని, రాఘవేంద్ర స్వామి కోరిక మేరకు అదే శిలను బృందావనానికి వినియోగించారు. బృందావనం నిర్మాణంలో 713 సాలగ్రామములు పొందుపరిచారు. పూజాది దేవతలు 116 మంది ఉన్నారు. 24 తోరణాలు, 16 అడ్డపట్టీలు, 16 నిలువు పట్టీలు, 4 ఫలకాలు, 12 గూళ్లు, 32 కమలములు, 8 అడుగు భాగాలు, అడుగున 4 అడ్డ పట్టీలు మొత్తం 116 ఉన్నాయి. చక్రాబ్జ మండలంలో మొత్తం 597 వలయాలే కాకుండా బృందావన నలుదిక్కుల్లో దేవతలు కొలువై ఉన్నారు. ముందు భాగంలో 41 మంది, కుడి భాగాన 30 మంది, ఎడమ భాగంలో 35 మంది, వెనుకభాగాన 29 మంది దేవతామూర్తులు కొలువై ఉన్నారు. సకల దేవతల స్వరూపంగా, కోటి సూర్యప్రభ తేజమై రాఘవేంద్రుల బృందావనం వెలుగొందుతోంది.



రాఘవేంద్రుల మూల బృందావనం

భక్తుల కల్పతరువు రాఘవేంద్రస్వామి




కలియుగంలో భక్తకోటి పునీత క్షేత్రంగా రాఘవేంద్ర స్వామి క్షేత్రం వర్ధిల్లుతోంది. యుగయుగాల చరిత్ర మంత్రాలయం సొంతం. దైవాంశ సంభూతులు శ్రీ రాఘవేంద్ర స్వామి ఇక్కడ కొలువుదీరడంతో తుంగాతీరం పావనమైంది. పరమ భక్తులకు కల్పతరువుగా రాఘవేంద్రులు వెలుగొందుతున్నారు. ఖండాంతరాలకు రాఘవేంద్రుల ఖ్యాతి వ్యాప్తి చెందింది. రాఘవేంద్ర స్వామి ఆరాధన సప్తరాత్రోత్సవాలు దేదీప్యమానంగా జరిపేందుకు సర్వదా శ్రమిస్తున్నాం.


– సుబుధేంద్రతీర్థులు, శ్రీమఠం పీఠాధిపతి

మంత్రాలయం మహత్యమిదీ..

- కృతయుగానికి చెందిన హిరణ్యకశిపుడు, హిరణ్యాక్షుడు శివుడిని ప్రసన్నం చేసుకునేందుకు మంత్రాలయంలో తపస్సు చేశారు. అందుకు తార్కాణంగా రాఘవేంద్రస్వామి బృందావనం అభిముఖంగా ఆంజనేయస్వామి విగ్రహం పక్కనే హిరణ్యకశిపుడు ప్రతిష్టించిన శివలింగం ఉంది. హిరణ్యకశిపుడి రాజ్యంలోనే సుపుత్రులు ప్రహ్లాదరాయలు ఇక్కడ లోకకల్యాణార్థం యాగం చేశారు. ప్రస్తుత బృందావన దిగువ భాగాన యజ్ఞగుండం ఉన్నట్లు స్థల పురాణం చెబుతోంది.
- త్రేతాయుగంలో వనవాసంలో భాగంగా శ్రీరామచంద్రమూర్తి తుంగభద్ర నది పరివాహకంలో పర్యటించారు. మంత్రాలయం మీదుగా గురజాల పుణ్యక్షేత్రం వెళ్లారు. అందుకు సాక్షీభూతంగా మేళిగనూరు, రాంపురం, మంత్రాలయంలో రామలింగేశ్వరస్వామి విగ్రహాలు ఉన్నాయి. గురజాలలో సైకత రామలింగేశ్వర శివలింగం పూజలు అందుకుంటోంది. శ్రీరామచంద్రమూర్తి మాధవరం గ్రామం వంక సమీపంలో ఉన్న నల్లరాతిపై కాసేపు సేద తీరినట్లు స్థలపురాణం చెబుతోంది.
- ద్వాపరయుగంలో అనుసాల్వుడు అనే సామంతరాజు రాజ్య పాలన చేసేవాడు. అనుసాల్వుడితో మంత్రాలయం వద్ద కృష్ణార్జునుల యుద్ధం జరిగింది. యుద్ధ సమయంలో ప్రహ్లాదరాయల యజ్ఞగుండం ప్రదేశంలో అనుసాల్వుడు నిల్చుని అర్జునుడితో తలపడ్డారు. భీకర యుద్ధంలో సామంతరాజు ధాటికి అర్జునుడు నిలువలేకపోయారు. దివ్యదృష్టితో కృష్ణభగవానుడు స్థల మహత్యాన్ని అర్జునుడికి వివరించి రథాన్ని వెనకడుగు వేయించారు. యజ్ఞగుండం దాటగానే అనుసాల్వుడు పోరాడుతూ ఓటమి పాలయ్యాడు.
- కలియుగంలో ద్వైత సిద్ధాంత స్థాపకులు మధ్వాచార్యులు, రాఘవేంద్రస్వామి పూర్వపు గురువులు విబుధేంద్రతీర్థులు, విజయీంద్రతీర్థులు, సుధీంద్రతీర్థులు ఈ క్షేత్రాన్ని సందర్శించి స్థల మహిమను ఇనుమడింపజేశారు. యుగయుగాల చరిత్ర కల్గిన ఈ పుణ్య స్థలిలోనే రాఘవేంద్ర స్వామి సశరీరంగా బృందావన ప్రవేశం చేశారు.



శ్రీమఠంలో హిరణ్యకశిపుడు ప్రతిష్ఠించిన శివలింగం



శ్రీరామచంద్రమూర్తి సేద తీరిన ప్రదేశంగా చెప్పబడుతున్న ప్రాంతం

పిచికారీ..కాకూడదు ప్రమాదకారి

- పురుగు మందుల పిచికారీలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి
- మాస్క్, కళ్లజోడు ధరించాలి
- సిఫార్సు ప్రకారమే మందులు వాడాలి


పురుగుమందులు పిచికారీ చేస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): ఖరీఫ్‌లో పంటలు వివిధ దశల్లో ఉన్నాయి. పత్తి, మొక్కజొన్న, వేరుశనగతో పాటు నీటిపారుదల కింద సాగు చేసిన పంటల్లో చీడపీడలు కనిపిస్తున్నాయి. వీటి నివారణకు పురుగు మందుల పిచికారీలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. లేదంటే విష ప్రభావానికి గురై ప్రాణాలు పోయే అవకాశం ఉంది.

పెరుగుతున్న పురుగు మందుల వినియోగం...

ఉమ్మడి జిల్లాలో మిర్చి, పత్తి, కంది, వరి సాగు ఎక్కువగా ఉంది. దీంతో పురుగుమందుల వినియోగం కూడా పెరుగుతోంది. మోతాదుకు మించి వినియోగిస్తుండటం వివిధ అనర్థాలకు దారి తీస్తోంది. ఉమ్మడి జిల్లాలో 1,980 పురుగుమందుల దుకాణాలు ఉన్నాయి. ఇందులో కర్నూలు జిల్లాలో 1,118, నంద్యాల జిల్లాలో 862 ఉన్నాయి. పెట్టుబడి వ్యయం వీటి మీదనే ఎక్కువగా ఉంటోంది. 2021–22లో 1.49 లక్షల టన్నులు, 2022–23లో 1.53 లక్షల టన్నుల పురుగు మందులు వినియోగించినట్లు తెలుస్తోంది. పురుగు మందుల వినియోగంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల అస్వస్థతకు గురై ఏటా 10 నుంచి 15 మంది రైతులు మరణిస్తున్నారు.

జాగ్రత్తలు ఇవీ..

- కూరగాయ పంటలపై మోనోక్రోటోపాస్, గడ్డి మందులను ఎట్టి పరిస్థితుల్లోనూ పిచికారీచేయరాదు.
- స్ప్రేయర్‌ను వాడిన తర్వాత శుభ్రమైన నీటిలో కడిగి భద్రపరుచుకోవాలి.
- వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు సిఫార్సు చేసిన ప్రకారమే మందులు వాడాలి. మోతాదుకు మించి, ఒకేసారి మూడు, నాలుగు రకాల మందులు కలిపి వాడరాదు.
- గాలికి ఎదురుగా వెళ్తూ పురుగు మందులు పిచికారీ చేయరాదు. ఉదయం 10 గంటల్లోపు, సాయంత్రం 4 గంటల తర్వాత మాత్రమే పిచికారీ చేయాలి.
- కలిపిన మందును ఎట్టి పరిస్థితుల్లోను మిగిల్చరాదు.
- పురుగు మందులు స్ప్రే చేసే సమయంలో నీళ్ల తాగడం, ఏమైనా తినడం, బీడీలు, సిగరెట్లు తాగడం, గుట్కాలు నమలడం వంటివి చేయరాదు.
- ముక్కుకు విధిగా మాస్క్ వేసుకోవాలి. కళ్లకు నల్లటి అద్దాలు పెట్టుకోవాలి. రక్షణ దుస్తులు ధరించాలి.
- ఖాళీ డబ్బాలను పూడ్చి వేయాలి. వాటిని ఇతర అవసరాలకు వాడరాదు.
- మందులను గదిలో కాకుండా ఆరుబయట కర్రతో కలపాలి.
- పిచికారీ పూర్తి అయిన తర్వాత స్నానం చేసేంత వరకు నీళ్ల తాగడం, అన్నం తినడం చేయరాదు.

పురుగు ప్రభావానికి లోనైతే...

విషప్రభావానికి గురైన వ్యక్తులకు తలనొప్పి, అలసట, బలహీనత, తలతిరుగడం, చర్మం, కళ్ల మంట, కంటిచూపు మందగించడం, కనుగుడ్లు చిన్నవిగా మారడం, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు లభిస్తాయి. అస్వస్థతకు గురైనట్లు కనిపిస్తే వెంటనే వాంతి చేసుకునే విధంగా చింతపండు పులుసు, కుంకుడు కాయల రసం, ఆముదం, మజ్జిగ తాపించాలి. వాంతితో కడుపులోని పదార్థాలు బయటికి పోతే విషం తీవ్రత తగ్గుతుంది. ఏ మందు పిచికారీ చేస్తూ అస్వస్థతకు గురయ్యారో అ డబ్బాను ఆసుపత్రికి తీసుకెళ్తే సరైన విరుగుడును కనుగునే అవకాశం ఉంది.

మిత్ర పురుగులను కాపాడుకోవాలి



పురుగుమందుల పిచికారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. పంటలకు మేలు చేసే మిత్ర పురుగులను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది. అధిక విషప్రభావం ఉన్న పురుగు మందులు వాడటం వల్ల తేనెటీగలు, అక్షింతల పురుగులు, తూనీగలు, కందిరీగలు, అల్లిక పురుగులు, సాలెపురుగులు, పిచ్చుకలు, నెమళ్లు మృత్యువాత పడుతున్నాయి. మిత్రపురుగులు పంటలకు హాని చేసే పురుగులను ఆహారంగా తింటూ వాటి తీవ్రతను తగ్గిస్తాయి.

– సాలురెడ్డి, ఏడీఏ, కర్నూలు

క్లుప్తంగా

ఎమ్మిగనూరులో చోరీ

- రూ.లక్ష నగదు, 8 తులాల బంగారం అపహరణ


దుండగులు బీరువా పగులగొట్టిన దృశ్యం

ఎమ్మిగనూరు: పట్టణంలోని తిరుమలనగర్‌లో ఆదివారం రాత్రి ఓ ఇంట్లో చోరీ జరిగింది. తిరుమల నగర్ 5వలైన్‌లో పీపీకే వరప్రసాద్ ఇంట్లో ఆదివారం రాత్రి దొంగలు పడి రూ.లక్ష నగదుతోపాటు 8 తులాల బంగారం దోచుకెళ్లారు. వారం క్రితం వరప్రసాద్ భార్య, పిల్లలు బెంగళూరుకు వెళ్లారు. రెండు రోజుల క్రితం వరప్రసాద్ కూడా తిరుపతి శ్రీ వెంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేరన్న సమాచారాన్ని గుర్తించి దొంగలు చోరీ చేశారు. సోమవారం ఉదయం 5 గంటలకు తిరుపతి నుంచి వచ్చిన వరప్రసాద్ ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాను తెరచి ఉన్నట్లు గమనించాడు. ఇంట్లో ఉన్న రూ.లక్ష నగదుతోపాటు 8 తులాల బంగారం చోరీ జరిగిందని పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎద్దుల బండిని ఢీకొట్టిన లారీ

- గాయపడిన భార్యాభర్తలు


ప్రమాదంలో తునాతునుకులైన ఎద్దుల బండి

ఆస్పరి: మండలంలోని చిన్నహోతూరు గ్రామ సమీపంలో సోమవారం ఎద్దుల బండిని లారీ ఢీకొట్టడంతో భార్యాభర్తలు, ఒక ఎద్దు, ఒక ఆవుకు తీవ్ర గాయాలైనట్లు ఎస్‌ఐ వరప్రసాద్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు మేరకు.. చిన్నహోతూరుకు చెందిన భార్యాభర్తలు నాగరాజు, లక్ష్మి ఎద్దుల బండిపై ఆస్పరి వైపు ఉన్న పొలానికి వెళ్తుండగా ఆలూరు నుంచి ఆస్పరి వైపు వస్తున్న లారీ వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. ప్రమాదంలో ఎద్దుల బండి తునాతునకలైంది. ఎద్దుల బండి ముందు వెళ్తున్న ఆవు గాయపడింది. అలాగే భార్యాభర్తలకు, ఒక ఎద్దుకు గాయాలయ్యాయి. గాయపడిన దంపతులను ఆదోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రమాదంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అర్జీలపై నిర్లక్ష్యం వద్దు


డీఆర్‌ఓకు వినతిపత్రం అందిస్తున్న ప్రజలు

కర్నూలు(అర్బన్): జగనన్నకు చెబుదాం–స్పందన అర్జీల పట్ల అధికారులు నిర్లక్ష్యం చేయకుండా పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్‌వీ నాగేశ్వరరావు కోరారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'జగనన్నకు చెబుదాం–స్పందన ' కార్యాక్రమంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ ఈ నెల 3న శుక్రవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆధ్వర్యంలో ఉద్యోగులకు స్పందన కార్యక్రమం నిర్వహించి అర్జీలను స్వీకరించామన్నారు. వీటిని సంబంధిత శాఖలకు చెందిన అధికారులకు పంపి సోమవారం లోపు పరిశీలించి అర్జీదారులకు సమాచారం అందించడంతో పాటు ఎండార్స్‌మెంట్ ఫిజికల్ కాపీని చేరవేయాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నాగప్రసన్న లక్ష్మి, జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు హాజరయ్యారు.

రికార్డు అసిస్టెంట్‌పై కేసు నమోదు

కోవెలకుంట్ల: ఆలూరు డిగ్రీ కళాశాల రికార్డు అసిస్టెంట్ నాగేశ్వరరావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటరెడ్డి సోమవారం తెలిపారు. 2016 – 2021 వరకు కోవెలకుంట్ల వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేసిన నాగేశ్వరరావు కళాశాల విద్యార్థుల ఫీజులు దాదాపు రూ. 3.09 లక్షలు సొంత ఖర్చులకు వాడుకున్నాడు. 2021లో ఆయన ఆలూరు డిగ్రీ కళాశాలకు బదిలీపై వెళ్లాడు. ఆ సమయంలో రికార్డులు ఎవరికీ అప్పగించలేదు. అనంతరం వచ్చిన ప్రిన్సిపాళ్లు కూడా ఈ విషయాన్ని పట్టించుకోలేదు. కాగా 2022లో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన కేశవరావు రికార్డులు పరిశీలించి కళాశాల నిధులు స్వాహా అయినట్లు ఉన్నత విద్యా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేపట్టిన అధికారులు ఈనెల 16న నాగేశ్వరరావును సస్పెండ్ చేశారు. వారి ఆదేశాల మేరకు ప్రస్తుత ప్రిన్సిపాల్ రామసుబ్బారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

హోంగార్డు ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

- స్పందనలో ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితుడు


స్పందన కార్యక్రమంలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు: హోంగార్డు ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.1.50 లక్షలు తీసుకుని మోసం చేశారని ఎస్పీ కృష్ణకాంత్‌కు నందవరం మండలం కొనకలదిన్నె గ్రామానికి చెందిన ప్రదీప్ ఫిర్యాదు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో సోమవారం ఎస్పీ స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి ఫిర్యాదులను స్వీకరించి నేరుగా వారితో మాట్లాడి ఎస్పీ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా స్పందనకు 96 ఫిర్యాదులు వచ్చాయి. వాటన్నిటిపై చట్ట పరిధిలో విచారణ జరిపి త్వరితగతిన సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. డీఎస్పీ శ్రీనివాసులు కూడా స్పందన కార్యక్రమంలో పాల్గొన్నారు.

స్పందనకు వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని...

- జొహరాపురం ఇందిరమ్మ గృహాల్లో పట్టా మార్పిడి చేసి వేరే వ్యక్తులు స్థలాన్ని ఆక్రమించుకున్నారని, విచారణ జరిపి న్యాయం చేయాలని కర్నూలు సాయిబాబా నగర్‌కు చెందిన అంజనమ్మ ఫిర్యాదు చేశారు.
- కర్నూలు మాధవ నగర్‌లో ఉన్న ప్రైవేటు స్కూల్‌లో ఇద్దరు పిల్లలకు అడ్మిషన్ కట్టి వెంటనే డ్రాప్ అయినప్పటికీ చెల్లించిన డబ్బులు వాపసు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, విచారణ జరిపి తగు న్యాయం చేయాల్సిందిగా శ్రీరాం నగర్‌కు చెందిన రేష్మ ఫిర్యాదు చేశారు.
- ఇద్దరు వ్యక్తులు తన పొలానికి దారి లేకుండా చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని నందవరం మండలం నాగులదిన్నె గ్రామానికి చెందిన చిన్న మునెప్ప ఫిర్యాదు చేశారు.
- కర్నూలు బళ్లారి చౌరస్తాలోని ఎంజీ బ్రదర్స్ జేసీబీ షోరూమ్‌లో సేల్స్‌మెన్లుగా పనిచేస్తున్న బలరాముడు, వెంకటేశ్వర్లు నమ్మించి పాన్ కార్డు, ఆధార్ కార్డు తీసుకుని జేసీబీ లోన్ ఇప్పిస్తానని ఫైనాన్స్‌లో డబ్బులు తీసుకుని కట్టకుండా మోసం చేశారని కర్నూలు మండలం దేవమాడ గ్రామానికి చెందిన నాగన్న ఫిర్యాదు చేశారు.
- 108 వాహనంలో డ్రైవర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి కర్నూలుకు చెందిన సాదిక్, సయ్యద్ అనే వ్యక్తులు రూ.1.60 లక్షలు డబ్బులు తీసుకుని మోసం చేశారని కల్లూరు మండలం ఎ.గోకులపాడు గ్రామానికి చెందిన సోమశేఖర్ ఫిర్యాదు చేశారు.

మూలరామ నిలయం ప్రారంభం


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన మంత్రాలయంలో సీఆర్వో ఆఫీస్ వెనుక భాగంలో నిర్మించిన మూలరామ నిలయాన్ని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు సోమవారం ప్రారంభించారు. శ్రీరాఘవేంద్రస్వామి భక్తుడు సోమశేఖర్.. తన తల్లిదండ్రులు లక్ష్మమ్మ, మునిస్వామి జ్ఞాపకార్థం రూ.7 కోట్లు వెచ్చించి 100 గదుల మూలరామ నిలయం నిర్మించారు. ప్రత్యేక హోమాలు నిర్వహించి సోమవారం పీఠాధిపతి చేతుల మీదుగా ఈ వసతి గృహాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మఠం మేనేజర్–1 శ్రీనివాసరావు, మేనేజర్–2 వెంకటేష్‌జోషి, ద్వారపాలక అనంతస్వామి పాల్గొన్నారు.

మద్దికెర చేరుకున్న కృష్ణాజలాలు


హంద్రీనీవా కాలువలో ప్రవహిస్తున్న కృష్ణా జలాలు

మద్దికెర: హంద్రీనీవా కాలువకు ఈనెల 16 వతేదీన కృష్ణా జలాలను వదలగా.. బురుజుల, పెరవలి, హంప, ఎడవలి, మద్దికెర గ్రామ సమీపాల్లోకి సోమవారం వచ్చాయి. కాలువకు నీళ్లు రావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాలువకు దగ్గరలో ఉన్న బోరు బావుల్లో భూగర్భ జలాలు పెరుగుతాయని రైతులు సంతోషం వెలిబుచ్చారు. ఈ నీరు సోమవారం మధ్యాహ్నానికి అనంతపురం జిల్లా కసాపురం పుణ్యక్షేత్రం పరిసరాల్లోకి ప్రవేశించాయి.

పీహెచ్‌యూ భవన నిర్మాణాలకు టెండర్లు

కర్నూలు (న్యూసిటీ): జిల్లాలోని పీహెచ్‌యూ (పబ్లిక్ హెల్త్ యూనిట్ల) భవన నిర్మాణాల కోసం ఆర్‌అండ్‌బీ శాఖ టెండర్లు పిలిచింది. సి.బెళగల్, ఆస్పరి, కృష్ణగిరి, పెద్దకడుబూరు, గోనెగండ్ల మండల కేంద్రాల్లో పీహెచ్‌యూ నిర్మాణాలకు ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు రూ.1,68,86,000 కోట్లతో టెండర్లను పిలిచారు. ఈ నెల 25వ తేదీ వరకు టెండర్లలో పాల్గొనేందుకు అవకాశం ఉందని ఆర్‌అండ్‌బీ శాఖ ఎస్‌ఈ నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సి.బెళగల్‌కు రూ.33.56 లక్షలు, ఆస్పరికి రూ.33.86 లక్షలు, కృష్ణగిరికి రూ.34.20 లక్షలు, పెద్దకడుబూరుకు రూ.34.24 లక్షలు, గోనెగండ్లకు రూ.33 లక్షలు చొప్పున నిధులను ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తికాగానే పీహెచ్‌యూ భవన నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

రోడ్డు మెటల్ క్వారీల తనిఖీ


బసలదొడ్డిలో క్వారీని పరిశీలిస్తున్న డీడీ రాజశేఖర్, విజిలెన్స్ ఏడీ బైరాగి నాయుడు

కర్నూలు (న్యూసిటీ): పెద్దకడుబూరు మండలంలోని మూడు రోడ్డు మెటల్ క్వారీలను తనిఖీ చేసినట్లు మైనింగ్ శాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. బసలదొడ్డి గ్రామంలోని క్వారీని తనిఖీ చేసి అనుమతికి మించి తవ్వకాలు జరపరాదని లీజ్‌దారుడికి సూచించామని చెప్పారు. క్వారీల యజమాజనులు పర్యావరణ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీడీ రాజశేఖర్ హెచ్చరించారు. తనిఖీల్లో విజిలెన్స్ అడిషనల్ డైరెక్టర్ బైరాగి నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

మాతృత్వ ఫెర్టిలిటీ సెంటర్ ప్రారంభం


సెంటర్‌ను ప్రారంభిస్తున్న వైద్యులు

నంద్యాల టౌన్: ప్రముఖ కార్పొరేట్ ఫెర్టిలిటీ సెంటర్ అయినటువంటి మాతృత్వ ఫెర్టిలిటీ సెంటర్ తమ 5వ శాఖను నంద్యాల పట్టణం పద్మావతి నగర్‌లో సోమవారం ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ, పట్టణ వైద్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫెర్టిలిటీ సెంటర్ వైద్యులు డాక్టర్ పద్మలత, రేఖా రాజేష్, సరిత, శివ జ్యోతి మాట్లాడుతూ రాయలసీమలోనే అత్యంత అధునాతన వైద్య సదుపాయలతో సంతానోత్పత్తి కేంద్రం ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు.

మహానందీశ్వరుడి సేవలో..


జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాసరావు దంపతులకు వేదాశీర్వచనం చేస్తున్న పండితులు

మహానంది: కర్నూలు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. శ్రీనివాసరావు దంపతులతో పాటు న్యాయసేవా సాధికార సంస్థ సెక్రటరీ సీహెచ్‌ఎస్‌వీ శ్రీనివాసరావులు సోమవారం మహానందీశ్వరుడిని దర్శించుకున్నారు. మహానందికి వచ్చిన వారికి ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వారు శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించి పల్లకీ సేవలో పాల్గొన్నారు. అలంకార మండపంలో ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి వారికి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేయించి స్వామివారి మెమొంటో అందించారు. వారి వెంట సీఐ రవీంద్ర, ఆలయ సూపరింటెండెంట్లు చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీధర్‌బాబు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ప్లంబర్ మృతి


అలీబాషా(ఫైల్)

కోడుమూరు రూరల్: మోటారు సైకిల్‌ను బొలెరో వాహనం ఢీకొనడంతో ప్లంబర్ మృతి చెందాడు. ఈ దుర్ఘటన ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. కోడుమూరులోని బేపారం వీధికి చెందిన అలీబాషా(25) ప్లంబర్ పనిచేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఆదివారం రాత్రి పని ముగించుకుని కర్నూలు నుంచి కోడుమూరుకు మోటారు సైకిల్‌పై వస్తున్నాడు. కోడుమూరు వైపు నుంచి కర్నూలు మండలంలోని తడకనపల్లెకు వెళుతున్న బొలెరో వాహనం కొత్తూరు గ్రామ సమీపాన మోటారు సైకిల్‌ను వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అలీబాషా తల నుజ్జునుజ్జు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కోడుమూరు పోలీసులు సంఘటానా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు అలీ బాషాకు భార్య ముల్లా హాజిరాబి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గూడూరు సమీపంలో వరినాట్లు వేయడంలో నిమగ్నమైన రైతులు



అన్నదాత ఆనందిం‘చేను’

కొన్ని ఆలస్యంగానైనా కాలువలకు నీరు రావడంతో అన్నదాతల మోములు ఆనందంతో విప్పారాయి. వివిధ పంటల సాగు పనులు ఊపందుకున్నాయి. ట్రాక్టర్లతో పొలాలను సిద్ధం చేయడం.. నారు పీకి వరి నాట్లు వేయడం.. తదితర పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే సాగులో ఉన్న పత్తి, ఆముదం, వేరుశనగ పైర్లలో అంతర సేద్యం చేస్తున్నారు. మొక్కలకు సత్తువ రావడంతో పొలాలు పచ్చదనాన్ని అద్దుకుని కనువిందు చేస్తున్నాయి. – సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు


చనుగొండ్ల వద్ద ట్రాక్టరుతో పొలాలను సిద్ధం చేస్తున్న దృశ్యం


కొత్తకోట వద్ద వరి నాటిన పొలం


కోడుమూరు సమీపాన పత్తిపొలంలో కలుపు తీస్తున్న రైతులు